'అంతా అయిపోయింది.. అమెరికాలో పీజీలూ, ఉద్యోగాల కలలూ ఇక కల్లలే..' అంటూ దిగాలు పడుతున్నారా! ఆగండి. అంత కంగారు పడాల్సిన పనేమీ లేదంటున్నారు నిపుణులు. ప్రస్తుతం విద్యార్థులు వేచి చూడటం మంచిదనీ, అనవసరంగా ఎటువంటి చర్యలూ తీసుకోవద్దనీ సూచిస్తున్నారు!

# కంగారు వద్దు.. వేచి చూద్దాం!

ప్రస్తుతం అమెరికాలో ఉండేందుకు ఇచ్చే హెచ్-1బీ వీసాల గురించే ఎక్కడ చూసినా చర్చ. ఎక్కడో అమెరికాలో కదా, ఇక్కడ ఎందుకింత హడావిడి అనుకోవడానికి వీల్లేదు. ఏటా 85 వేల మందికిపైగా ఈ వీసా అందుకుంటున్నారు. దీనిలో 20 వేల మందికి అక్కడే మాస్టర్స్ చేసినవారికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే అప్పటికే ఇతర దేశాల నుంచి అమెరికా వచ్చి, అక్కడే చదువుకుంటున్నవారన్నమాట. అంటే 65 వేల మంది బయట దేశాల నుంచి నేరుగా ఈ వీసాలపై వస్తున్నారు. వీరిలో 70 శాతానికి మించి భారతీయులే. అందులో 50 నుంచి 55 శాతం తెలుగువాళ్లే! అంటే దాదాపు 30 నుంచి 35 వేల మందికిపైగా వృత్తి నిపుణులు హెచ్-1బీ వీసాలపై అమెరికా వెళ్తున్నారు. అందువల్ల అక్కడ జరిగే ఏ పరిణామం అయినా.. రెండు తెలుగు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

గతంలో 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చయ్యే ఈ వీసా ఫీజును అమాంతం లక్ష డాలర్లకు పెంచేశారు. ముందు ఏటా ఈ సొమ్ము చెల్లించాలని చెప్పినా.. తర్వాత అది వార్షిక ఫీజు కాదనీ, ఒకసారి కడితే సరిపోతుందని వివరణ ఇచ్చారు. ఇప్పటికే అనేకచోట్ల వివిధ రకాలుగా ఈ అంశంపై ఆందోళన కలుగుతోంది. ఈ నిర్ణయాలు ఇలాగే స్థిరంగా ఉంటాయని అనుకోలేం. ఒకవేళ ఆందోళనకారులు కోర్టు ముందు అంశాన్ని విన్నవిస్తే మార్పులపై స్టే విధించే అవకాశమూ లేకపోలేదు. విద్యార్థులూ, ఉద్యోగార్థులూ కంగారు పడకుండా జరిగే పరిణామాలను జాగ్రత్తగా అనుసరించాలి. ప్రభుత్వ నిర్ణయాలు ఎలా మారినా.. మన కెరియర్ మీద అంతగా ప్రభావం చూపని విధంగా స్థిరంగా సిద్ధం కావాలి.

### ఎందుకు?

హెచ్1బీ వీసా దుర్వినియోగం అవుతోందనేది ప్రధాన ఆరోపణ. కేవలం ఉన్నతస్థాయి విద్యావంతులూ, నైపుణ్యాలున్నవారూ మాత్రమే అమెరికా రావాలనే ఈ ఉద్దేశంతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో 70 వేల డాలర్ల జీతం నుంచి 3 లక్షల పైచిలుకు డాలర్ల జీతం తీసుకునే వారందరూ ఒకే పద్ధతిన వెళ్లాల్సి వస్తోంది. అదే, వీసా ఫీజే లక్ష చేశారనుకోండి.. అప్పుడు అంతకంటే కనీసం రెండు, మూడు రెట్లు సంపాదించేవారే దాని కోసం ప్రయత్నించగలరు. ఉన్నతమైన స్కిల్స్ ఉన్నవారే అమెరికాకు వచ్చే వీలుంటుంది. మధ్యస్థాయి వారంతా తిరిగి తమ దేశాలకు పయనమవ్వాల్సి ఉంటుంది (లేదా కొత్తగా వెళ్లేందుకు కుదరదు). సగటున రెండు నుంచి పదేళ్ల అనుభవం ఉన్నవారి జీతం.. 70 వేల నుంచి లక్షన్నర డాలర్ల వరకూ ఉంటుంది. ఇలాంటి వారందరికీ ఈ నిర్ణయం ఇబ్బందే!

- ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. ఈ నిర్ణయం కొత్తగా వీసా కోసం దరఖాస్తు చేసే వారికే వర్తిస్తుంది. ఇప్పటికే అక్కడ ఉన్నవారు కంగారు పడాల్సిన పనిలేదు.
- ఈ విధివిధానాల్లో మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదు. హడావిడిగా వెళ్లాపోవాల్సిన పనిలేదు. ఒకటి, రెండు వారాలు వేచి చూడొచ్చు.
- ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్) విషయంలో ఎలాంటి మార్పులూ లేవు.



### హెచ్-1బీ వీసా అంటే?




ఇదో నాన్ ఇమిగ్రెంట్ (పర్యటకం, విద్యాభ్యాసం లాంటి నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఆ దేశంలో తాత్కాలికంగా ప్రవేశించేవారి) వీసా. ఇది ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యు.ఎస్. కంపెనీలను అనుమతిస్తుంది.

**ఎవరు అర్హులు:** కనీసం బ్యాచిలర్ డిగ్రీ /తత్సమాన పని అనుభవం ఉండి.. యు.ఎస్. నియామక సంస్థ నుంచి జాబ్ ఆఫర్ ఉన్నవారు. యు.ఎస్. సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) దగ్గర నియామక సంస్థ హెచ్- 1బీ పిటిషన్ ఫైల్ చేయటం తప్పనిసరి.

**లాటరీ సిస్టమ్:** రిజిస్ట్రేషన్ల సముదాయం లోంచి ఎవరు పిటిషన్ ఫైల్ చేయొచ్చో నిర్ణయించడానికి యూఎస్‌సీఐఎస్ ప్రతి సంవత్సరం మార్చి నెలలో రాండమ్ లాటరీని నిర్వహిస్తుంది.

**వ్యవధి:** 3 ఏళ్లు (దీన్ని 6 ఏళ్ల వరకూ పొడిగించవచ్చు). గ్రీన్ కార్డు ప్రాసెసింగ్‌లో ఉన్నవారికి మరింత పొడిగింపునకు వీలుంటుంది.

### దగ్గర దారులు వెతకొద్దు

ఇప్పటికే అక్కడ మాస్టర్స్ చదివేందుకు వెళ్లిన విద్యార్థులైనా, కొత్తగా వెళ్లాల్సిన వారైనా.. కొన్ని విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

1 హెచ్-1బీ వీసా కోసం దగ్గర దారులు వెతకొద్దు. ఏదో ఒక చిన్నపాటి యూనివర్శిటీలో సీటు తెచ్చుకుందాం, పార్ట్‌టైమ్ జాబ్స్ చేస్తూ గడిపేద్దాం, ఏదో ఒకలా పని వెతుక్కుందాం అనుకోవద్దు, ఆ రోజులు పోయాయి. నిబంధనలు చాలా కఠినంగా అమలవుతున్నాయి.

2 అక్కడ సీటు తెచ్చుకున్నాక.. ఎటువంటి అక్రమ చర్యలకూ పాల్పడాలని చూడొద్దు. ఆఫ్ క్యాంపస్ జాబ్స్ వంటి వాటి గురించి అస్సలు ఆలోచించవద్దు.

3 కోర్సులను చక్కగా పూర్తిచేయండి. ఏ సెమిస్టర్‌కు ఆ సెమిస్టర్ చదివేసుకోండి. ఇంటర్న్‌షిప్స్‌ను అశ్రద్ధ చేయొద్దు.

4 జాబ్ ప్లేస్‌మెంట్ గురించి ముందు నుంచే ఆలోచించండి.

5 తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలి. డబ్బు సిద్ధం చేసుకోకుండా విద్యార్థులను పంపకూడదు.

6 కెరియర్ మీద పూర్తిగా దృష్టి పెడితే.. వాళ్లు లక్ష డాలర్ల నిర్ణయం వెనక్కి తీసుకున్నా, తీసుకోకపోయినా.. మనం ఆ సొమ్ము చెల్లించే స్థాయిలో సంపాదించే వీలుంది. అమెరికాలో ఆ అవకాశాలున్నాయి. అందువల్ల శ్రమించండి.



**– శుభకర్ అలపాటి,**
డైరెక్టర్, గ్లోబల్ ట్రీ